అందని పశు వైద్యం

- బిచ్కుందలో వైద్యుల కొరత
- సంచార వాహనంతో అరకొర వైద్య సేవలు
- 27 జీపీలకు ఒకే పశు వైద్యశాల
- ఐదు నెలలకు ఒకసారి వస్తున్న మందులు



సంచార పశు వైద్యశాల అంబులెన్స్

బిచ్కుంద(జుక్కల్): మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. సమయానికి వైద్యం అందక మూగజీవాలు మృత్యువాతపడి పాడిరైతులు నష్టపోతున్నారు. బిచ్కుంద మండలంలో 27 గ్రామ పంచాయతీలకు ఒకే పశు వైద్యశాల ఉంది. వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, అటెండర్ ఇద్దరు మాత్రమే ఉన్నారు. మరో పోస్టు ఖాళీగా ఉంది. ఏడీఏ ఆఫీసు ఉన్నా ప్రాథమిక వెటర్నరీ(పీవీసీ) సెంటర్ బిచ్కుంద మండలంలో ఒక్కటి కూడా లేదు. ఏడీఏ కార్యాలయంలో డాక్టర్ పోస్టు లేకపోవడంతో పశువులకు వైద్యం చేసేవారు కరువయ్యారు. బిచ్కుంద చుట్టుపక్కన ఉన్న గ్రామాల రైతులు పశువులను తీసుకొని వెళ్లినప్పుడు ఏడీఏ చికిత్స చేసి పంపిస్తున్నారు. మండలంలో ఆవులు 2,462. గేదెలు 2,931, మేకలు 6,309, గొర్రెలు 14,281 ఉన్నాయి. నిబంధనల ప్రకారం నాలుగు, ఐదు గ్రామాలకు ఒక ప్రాథమిక వెటర్నరీ సెంటర్ ఉండాల్సి ఉంది. బండరెంజల్, గుండెనెమ్లి, వాజిద్‌నగర్, పుల్కల్, ఖద్గాం, శెట్లూర్, హజ్గుల్, తక్కడ్‌పల్లి, శాంతాపూర్, ఎల్లారం, రాజాపూర్, మానేపూర్, ఫత్లాపూర్, గుండెకల్లూర్ గ్రామాల నుంచి వైద్యం కోసం మండల కేంద్రానికి రావాలంటే సుమారు 18 నుంచి 15 కిలోమీటర్లు రావాల్సి ఉంటుంది. మండలంలో ఎక్కడ కూడా పశు వైద్యశాల లేదు. చికిత్స చేయించడానికి సౌకర్యం లేకపోవడంతో వైద్యం అందక జీవాలు చనిపోయి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురు ఆరోగ్యమిత్ర సేవకులు ఉండగా వారు గర్భధారణ చికిత్స చేస్తున్నారు. వైద్యశాలలో సరైన మందులు అందుబాటులో లేవు. ప్రభుత్వం వెటర్నరీ శాఖకు సరైన నిధులు విడుదల చేయకపోవడంతో నాలుగు, ఐదు నెలలకు ఒకసారి మందులు వస్తున్నాయి. మందుల కొరత తీవ్రంగా ఉంది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి మండంలోని వాజిద్‌నగర్, పుల్కల్, శాంతాపూర్, ఫత్లాపూర్, గుండెనెమ్లి గ్రామాలలో పశువైద్యశాలలు, సబ్ సెంటర్‌ల మంజూరుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

అంతంత మాత్రమే అంబులెన్స్ సేవలు..

పాడి రైతుల ఇంటి వద్దకే వెళ్లి పశువులకు వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంచార పశు వైద్యశాల అంబులెన్స్ ప్రారంభించింది. రైతులు 1962 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం అందిస్తే వారి ఇంటికి వెళ్లి జీవాలకు చికిత్స చేస్తారు. పేరుకే అంబులెన్స్ కాని సేవలు మాత్రం అంతంతేనని రైతులు అంటున్నారు. జీవీకే సంస్థ ఆధ్వర్యంలో అంబులెన్స్ నడుపుతున్నారు. ఇందులో ఒక డాక్టర్, అసిస్టెంట్, డ్రైవర్, హెల్పర్ ఉంటారు. జీవాల పేడ పరీక్షించడానికి అంబులెన్స్‌లో మైక్రోస్కోపి అందుబాటులో ఉంచారు. బ్యాక్టీరియా, నట్టల పరీక్షలు కూడా చేయడం లేదు. జుక్కల్ నియోజకవర్గంలోని 6 మండలాలకు ఒకటే అంబులెన్స్ ఉంది. ఆరు నెలల నుంచి అంబులెన్స్‌కి మందులు రాలేదు. రైతులే మెడికల్ దుకాణానికి వెళ్లి మందులు కొనుక్కోవడంతో అదనపు భారం పడుతోంది. అంబులెన్స్ ప్రతి రోజు సుమారు 8 నుంచి 10 గ్రామాలకు వంద కిలో మీటర్లు తిరుగుతోంది. నియోజక వర్గంలో సుమారు 15 మంది రైతుల ఇంటికి వెళ్లి జీవాలకు వైద్యం చేస్తున్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు.


బిచ్కుంద పశు వైద్యశాల


మైక్రోస్కోప్

"ప్రతిపాదనలు పంపించాం

బిచ్కుంద మండలంలోని ఆయా గ్రామాలలో ప్రాథమిక వెటర్నరీ సెంటర్, సబ్‌సెంటర్లు, ఏడీఏ కార్యాలయం కొత్త భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. బిచ్కుందలో డాక్టర్ పోస్టు లేదు .రైతులకు అందుబాటులో ఉండి పశువులకు చికిత్సలు చేస్తున్నాం. – భాస్కరన్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, బిచ్కుంద

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ


విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలో అశోక్‌నగర్ కాలనీలో గల గురుకుల పాఠశాలను, బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు చాట్ల వంశీకృష్ణ, వనిత, మమతా, శివకృష్ణమూర్తి, నాయకులు రాంమోహన్, సాయిబాబా, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలను సద్వినియోగం చేసుకోవాలి



నిజాంసాగర్(జుక్కల్): రేషన్ దుకాణాలను సద్వినియోగం చేసుకోవాలని మహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మల్లికార్జున్ కోరారు. సోమవారం ఆయా మండలాల్లోని తుంకిపల్లి, జక్కాపూర్, వెల్గనూర్ గ్రామాల్లో వారు వేర్వేరుగా నూతన రేషన్ దుకాణాలను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు లోక్యా నాయక్, కుమ్మరి రాములు తదితరులున్నారు.

పంట కాలువ బుంగల పూడ్చివేత



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామ పాత చెరువు పంట కాలువల బుంగలను సోమవారం ఆయకట్టు ప్రాంత రైతులు జేసీబీ సహాయంతో పూడ్చి వేయించుకున్నారు. పాత చెరువు పంట కాలువ శిథిలావస్థకు చేరుకొని బుంగలు పడటంతో ఆయకట్టు పంటలకు సాగు నీరు అందడం లేదు. కొన్నేళ్లుగా పంట కాలువలను పాలకులు పట్టించుకోకపోవడంతో చివరి ఆయకట్టు భూములు సాగుకు నోచుకోక బీళ్లుగా మారాయి. ఆయకట్టు రైతులు విరాళాలు సేకరించి జేసీబీతో పనులు చేయించారు. అధికార యంత్రాంగం ఇకనైనా స్పందించి పంట కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ఆయకట్టు ప్రాంత రైతులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, డయల్ 100, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై కామారెడ్డి పట్టణ పోలీసులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అంతేగాక షీ టీమ్స్ ఉపయోగం, మహిళల భద్రతకు పోలీసులు చేపడుతున్న చర్యల గురించి తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ ఎస్సై శ్రీరామ్, ఏఎస్సై రంగారావు, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ బహూకరణ



కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ఎస్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి భారతి సోమవారం వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ కాసర్ల గోదావరి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కలుషితం లేని నీరు తాగాలని సూచించారు. భారతిని పాఠశాల తరఫున సన్మానించి ఆమె చేస్తున్న సామాజిక సేవను కొనియాడారు. హెచ్ఎం గంగాకిషన్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ రాధా, శంకర్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, సాయిలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి వైద్యుడికి ఏషియన్ ఎక్స్‌లెన్స్ అవార్డు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రవీంద్రమోహన్‌కు ఉత్తమ వైద్యసేవలకుగాను అందించే ప్రతిష్టాత్మక ఏషియన్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. శనివారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డు అందించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఢిల్లీకి చెందిన ప్రముఖ జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థ క్రైట్స్ గ్రాఫ్టెస్ ప్రొడక్షన్ ఈ అవార్డులు అందించినట్లు వారు తెలిపారు. కరోనా సమయంలో రోగులకు అత్యుత్తమ సేవలు అందించినందుకుగాను ఈ అవార్డుతో పాటు ఇంటర్నేషనల్ ఏమినెన్స్ అవార్డు కూడా అందించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

వొకేషనల్ కోర్సులతో ఉపాధి



దోమకొండ: వొకేషనల్ కోర్సులతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వొకేషనల్ విద్యార్థులు విద్యాభ్యాసంలో భాగంగా ఆన్ జాబ్ ట్రైనింగ్ చేయగా ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు చదువు ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు వసంత్, రజిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.58 వేల విరాళం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం సోమవారం కామారెడ్డికి చెందిన బలరామన్ కేస్కర్ రూ.58 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

గడ్డి వితరణ

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్దరామేశ్వరాలయంలో ఉన్న కోడెల కోసం పలువురు రైతులు గడ్డిని వితరణ చేశారు. ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు కోడెలను మొక్కుగా సమర్పించారు. వాటికి కావలసిన గడ్డిని పలువురు భక్తులు, స్వచ్ఛందంగా అందజేస్తున్నారు. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన పోచమ్మల బాబు, చాకలి నరసింహులు, మంగలి బాబు, టప్ప రమేష్ తమవంతుగా ట్రాక్టర్ వరి గడ్డిని ఆలయానికి తీసుకువచ్చారు. అక్కడ ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం ఆయన వారిని అభినందించారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



భిక్కనూరు: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఆర్‌డీఏ పీడీ సురేందర్ చెప్పారు. మండల మహిళా సమాఖ్య తరపున మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పెద్ద మల్లారెడ్డికి చెందిన మన్నె విజయ, మన్నె లక్ష్మి హోటల్ మేనేజ్‌మెంట్‌లో పది రోజులపాటు శిక్షణ పొందారు. వారికి డీఆర్డీవో చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని సమాజంలో ముందుకుపోవాలన్నారు. మహిళా సమాఖ్య డీపీఎం రమేష్ బాబు, ఏపీఎం శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు రాజమణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో షెడ్డు నిర్మాణ పనులు



భిక్కనూరు: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సహకారంతో మండల కేంద్రంలో షెడ్డు నిర్మాణ పనులు చేపట్టామని బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా మండలకేంద్రంలోని సరస్వతి మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపం వద్ద షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు

మద్నూర్(జుక్కల్): సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలోని హుండీల లెక్కింపును అధికారులు సోమవారం చేపట్టారు. దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు, అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలోని హుండీలను విప్పి లెక్కించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆలయంలోని హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతామని ఆయన తెలిపారు. హుండీలో రూ.3,64,440 నగదు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీధర్, దూపదీప నైవేద్యం జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, సిబ్బంది వేణు, కల్పన, అర్చకులు విజయ్, భక్తులున్నారు.

ఫర్టిలైజర్ రికార్డుల పరిశీలన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం ఫర్టిలైజర్ రికార్డులను ఏడీఏ ఇంద్రసేనారెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ రికార్డులు తప్పకుండా అప్‌డేట్ చేయాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో కిషన్, సొసైటీ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మాణానికి స్థలం..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో డబుల్ బెడ్రూం కాలనీలో పలు అభివృద్ధి పనుల కోసం స్థలాన్ని డీఈ మధుబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మధుబాబు మాట్లాడుతూ..కాలనీలో మౌలిక వసతుల కోసం రూ. 57 లక్షల 70 వేలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ...జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కృషితో ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. పంచాయితీ రాజ్ ఏఈ శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాచప్ప, జీపీ కార్యదర్శి శ్రీను ఉన్నారు.

అభివృద్ధి పనులకు రూ.63.3 కోట్లు



నిజాంసాగర్(జుక్కల్):గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతితో పాటు గ్రామ పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణానికి ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ. 63.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో గ్రామ పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణానికి రూ. 18 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అంగన్‌వాడి కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం కోసం రూ.10.80 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. అలాగే గిరిజన తండాలతో పాటు అనుబంధ గ్రామాలు, గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 34.5 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు.

మురికి నీరు తొలగింపు

రాజంపేట: సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'సరఫరా అయ్యేది మురుగా..మంచి నీరా?' కథనానికి అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ డీఈ రమేష్, ఏఈ రజిత, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో జీపీ సిబ్బంది సహకారంతో భగీరథ నల్లా కనెక్షన్ వద్ద నుంచి మురికి నీరు తొలగించి సమస్యను పరిష్కరించారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..


మిషన్ భగీరథ పైపు లైన్ వద్ద మురికి నీటిని తొలగిస్తున్న కార్మికుడు

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి


వినతి పత్రం అందజేస్తున్న అయ్యప్ప స్వాములు

బాన్సువాడ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని సోమవారం అయ్యప్ప మాలధారణ స్వాములు సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతిని కోరుకునే హిందువులపై దాడులు క్షమించరాని నేరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అంతర్జాతీయ స్థాయిలో బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ విపత్తులో ఉన్నప్పుడు ఇస్కాన్ ప్రతినిధులు అక్కడ ఎన్నో సేవలు చేశారని, అలాంటి అన్నం పెట్టిన వారిని అరెస్ట్ చేయడం శోచనీయమని అన్నారు. అంతకుముందు అయ్యప్ప ఆలయం నుంచి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లారు. అయ్యప్ప సేవ ప్రతినిధులు కోనాల గంగారెడ్డి, ధనగారి కృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, వీరప్ప, సిద్ధి మహేష్, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు స్థల సేకరణ


బీబీపేటలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు


దోమకొండలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బీబీపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రతి మండలంలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టే మోడల్ హౌస్ నిర్మాణం కోసం సోమవారం అధికారులు స్థలాన్ని సేకరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన స్థలాన్ని ఎంపిక చేసి దాంట్లోనే నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ తెలిపారు. అలాగే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు ఎలా నిర్మించుకోవాలన్నిది, దీనిని దృష్టిలో ఉంచుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి మండలానికి మోడల్ హౌజ్ నిర్మిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మోడల్‌హౌజ్ ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. రూ.5 లక్షలతో జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టేందుకు స్థల పరిశీలన చేశారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు పూర్ణచంద్రోదయ కుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మనోహర్, శ్రీకాంత్ ఉన్నారు.

ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి


మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు

కామారెడ్డి రూరల్: ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని డీఎస్పీ నాగేశ్వర్‌రావు సూచించారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లనుద్దేశించి 'మై ఆటో ఇస్ సేఫ్' అనే అంశంపై ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా ఆటోకు ఉండాల్సిన కాగితాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, మద్యం సేవించి వాహనం నడపకుండా ఉండడం తదితర అంశాలపై సూచనలు చేశారు. కామారెడ్డి పట్టణ సీఐ, ఎస్సై, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

బీబీపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తాత్కాలికంగా బోధించేందుకు ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, సోషల్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి వెంకట లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే కళాశాలలో ఖాళీగా ఉన్న మ్యాథ్స్, ఫిజిక్స్ అధ్యాపక పోస్టులకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. బీఈడీ, పీజీ పూర్తి చేసిన వారు 4లోపు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9704569446 సంప్రదించాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ మీడియంలో భౌతిక శాస్త్రం బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ వీణాబాయి తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్‌తో పాటు బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. 4వ తేదీ లోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఎల్లారెడ్డి కేజీబీవీ జూనియర్ కళాశాలలో అందజేయాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సదాశివనగర్/రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి మండలం పోసానిపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏడీ నరేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ పోసానిపేట్ ఫీడర్‌పై విద్యుత్ పనులు చేస్తుండటంతో ఉదయం 10 గంటల నుంచి 12 వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

పోచారం కుటుంబాన్ని విమర్శిస్తే ఊరుకోం

బాన్సువాడ: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంట ఉండి అన్ని విధాలుగా లబ్ధిపొందిన వ్యక్తి నేడు పోచారం కుటుంబంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. సోమవారం బీర్కూర్ మండలం మల్లాపూర్‌లో వారు మాట్లాడారు. పోచారం కుటుంబంపై మాజీ జెడ్పీటీసీ సతీష్ చేసిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నాయకులు శంకర్, శ్యామల, రఘు, తదితరులు ఉన్నారు.

రెండు రికవరీ సెల్‌ఫోన్ల అప్పగింత

మాచారెడ్డి: పోగొట్టుకున్న రెండు సెల్ ఫోన్లను సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసి సోమవారం అప్పగించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. పాల్వంచకు చెందిన బక్కెల్లి భూపాల్, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం రాజుపేటకు చెందిన అల్లె అశోక్ సెల్ ఫోన్లు పోయినట్లు ఫిర్యాదు చేయగా ట్రేస్ చేసి అప్పగించినట్లు వివరించారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. ఆదివారం నాటికి 60 వేల 522 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు తెలిపారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ


భవానీపేటలో ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానీపేట ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్ స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కో–ఆర్డినేటర్ తుల రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సూర్య ప్రకాష్ గౌడ్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీరాజం, ఉపాధ్యాయులు అరుణ, లింగారెడ్డి, ఈశ్వరి, సుధాకర్, విక్రమ్, నవీన్ కుమార్ ఉన్నారు.

గుడి వద్ద భక్తులకు సౌకర్యాలు కరువు

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్దరామేశ్వరాలయంలోని మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. డోర్లు సరిగా లేవు. బాత్‌రూంలలో బకెట్లు, జగ్గులు కూడా లేవని భక్తులు పేర్కొంటున్నారు. సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

16 మంది కానిస్టేబుళ్ల నియామకం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్ సర్కిల్ పరిధిలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్ పోలీస్‌స్టేషన్లలో కొత్తగా 16 మంది కానిస్టేబుళ్ల నియామకం జరిగినట్లు సీఐ రవీంద్ర నాయక్ తెలిపారు.. ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఐదుగురు మహిళా, నలుగురు పురుష కానిస్టేబుళ్లు, నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళా, ముగ్గురు పురుష కానిస్టేబుళ్లు, లింగంపేట్‌లో ఒక మహిళా, ఇద్దరు పురుష కానిస్టేబుళ్లు నియమితులైనట్లు ఆయన తెలిపారు. వీరు సోమవారం సర్కిల్ కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు చెప్పారు.

తాడ్వాయికి నలుగురు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి పోలీసుస్టేషన్‌కు నలుగురు కొత్త కానిస్టేబుళ్లు వచ్చినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అనీల్, వంశీ, వాజీద్, సౌజన్యలు ఆదివారం తమ విధులలో చేరినట్లు తెలిపారు.